# రెండక్షరాల ప్రేమ

అమాయక చక్రవర్తి సుబ్బారావుకి, చక్కని చుక్క చంద్రికకూ పందిట్లో పెళ్ళయింది.

వాళ్ళిద్దరూ గాఢంగా ప్రేమించుకున్నాకే పెళ్ళి చేసుకున్నారు.

పెళ్ళయ్యాక ఆ ముచ్చట కూడ వెంటనే జరగాలన్నారు పెద్దలు.

సుబ్బారావున్న గదిలోకి చంద్రికనుతోశారు అమ్మలక్కలు.

అసలు కథ మొదలయ్యింది...

అలంకరించిన పట్టెమంచం దగ్గరకు హంసలా నడిచిరాలేదు చంద్రిక. పెళ్ళిహడావుడికి నీరసపడి బాతులా నడిచివొచ్చింది.

సుబ్బారావుకి చెమటలు పసట్టాయి.

చంద్రికను చూసిగాదు,

గదిలో టేబుల్ ఫ్యాన్ పెట్టారు. స్పీడ్‌గా తిరగటంలేదని బటన్ నొక్కాడు. అసలుకే మోసం వొఛ్చింది. అసలు ఆగిపోయి కూర్చుంది. పది నిముషాలు బటన్స్‌నొక్కుతూ, వైరు సరిచేస్తూ కూర్చున్నా ఫలితం దక్కలేదు.

గదిలో అగరొత్తుల, మల్లెపూల వాసనకంటే పట్టెమంచం కింద వుంచిన లడ్డుండలకావిడి, అరటిగెలలు తీపివాసనలు వెదజల్లాయి.

అన్నీ భరాయించి, మొహానికి చిరునవ్వు పులుముకుని చంద్రిక చెంతచేరాడు సుబ్బారావు.

చంద్రిక నిద్రకళ్ళతో జోగుతూంది.

ఆమె భుజాల చుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకోబోయాడు.

ఎన్నో సినిమాల్లో , కథల్లో తను చూసిన భార్యాభర్తల తొలి కలయిక 'ఎఫెక్ట్' రావాలనుకున్నాడు.

సుతారంగా ఆమె చిరుగడ్డాన్ని తనవైపుకు తిప్పుకోబోయాడు.

"ఇప్పుడొద్దు సుబ్బారావు... నాకు నిద్రొస్తుంది" అంటూ ఆవులిస్తూ పడుకుంది.

సినిమాలో మంచి రసవత్తరమైన శృంగార సన్నివేశంచూసేటప్పుడు కరెంటు పోయినట్లుగా ఫీలయ్యాడు సుబ్బారావు.

"ఈ రోజుకిక ఉపవాసం! ఎన్ని వసంతరాత్రులు ముందులేవు?" - అనుకుంటూ చంద్రిక నడుంపై చెయ్యివేసి పడుకున్నాడు. మరుసటి రోజూ అదేతంతు -

"నాకు నిద్రొస్తుంది" - అంటూ మూడంకెవేసి పడుకుంది చంద్రిక.

అలా వొదిలేస్తే లాభంలేదనుకుని ఆమె లేత గులాబీరేకుల్లాంటి పెదవుల్ని ముద్దుపెటర్టికోబోయాడు. అతన్ని నెట్టివేసింది.

"వాసనొస్తుందా? కాల్గెట్ రోజూ వాడుతున్నానే!" అన్నాడు అమాయక చక్రవర్తి. ఫక్కున నవ్వింది చంద్రిక. కానీ దగ్గరకు రానివ్వలేదు. మరో రాత్రి -

అప్పుడేవిచ్చిన ఎర్రగులాబీలా మిస, మిసలాడుతూవున్న చంద్రికను కౌగిట్లో బంధించబోయాడు సుబ్బారావు.

"నీకెప్పుడూ తొందరే! ఈరోజు బయటవున్నాను" - అంది చంద్రిక.

"గదిలోపలేవున్నావుగా!"

"అదిగాదు నా బుజ్జి! ఈ రోజూ శ్రీవారికి ఎర్రజెండా చూపిస్తున్నాను. పచ్చజెండా చూపించినప్పుడు దగ్గరకురండి" - అంది గోముగా సుబ్బారావు చెంపలు నిమురుతూ.

వారంరోజులుపోయినా సుబ్బారావుని దగ్గరకు రానివ్వలేదు చంద్రిక.

"ఏం చెయ్యమంటావ్ గురూ ! నా ప్రేమ సౌధం కూలిపోతున్నది. వెన్నెలరాత్రులన్నీ వృధా అయిపోతున్నాయ్!"

అప్పారావు దగ్గరకొచ్చి మొర పెట్టుకున్నాడు సుబ్బారావు.

రెండు పెట్టెల సిగరెట్లు ఖాళీచేసి, జుట్టంతా రేపుకుని సుబ్బారావుని కొన్ని ప్రశ్నలడిగేడు

అప్పారావు. ఓపిగ్గాసమాధానాలిచ్చేడు సుబ్బారావు.

"మీ ఆవిడ నిన్ను ప్రేమిస్తున్నదా?"

"రాధాకృష్ణుల్లా, రోమియో జూలియట్‌ల్లా, సలీం అనార్కలిలా మా ప్రేమ అమరం. చంద్రిక అనుమతి లేనిదే ఊపిరికూడపీల్చలేను. పెళ్ళికాకముందు ఎంత సరదాగా వుండేది! ఎన్నిసార్లు లతలా నన్ను అల్లుకుపోయింది. తియ్యటి ముద్దులిచ్చి కమ్మటి కబుర్లు చెప్పేది! పెళ్ళయ్యాకే ఈ తిప్పలన్నీ... అసలు దగ్గరకే రానివ్వడం లేదు"

"చంద్రికలో ఫ్రిజిడిటీ వుందనుకుంటా! కొంచెం ఓపిక పట్టి ఆమె చేసే పనులు మెచ్చుకుంటూ, ఆమె అందాన్ని పొగుడుతూ మెల్లగా నీదారిలోకి తెచ్చుకో!"

"ఎన్నాళ్ళు ఓపిక పట్టమంటావురా? చంద్రిక నాకేమన్నా కొత్తేమిటి? కొత్త పెళ్ళికూతురైతే ఏదో బెదురు వుంటుందనుకోవచ్చు. ఐదేళ్ళు ప్రేమ వెలగబెట్టినాకే మాకు పెళ్ళయ్యింది గదా!

మళ్ళీ దీర్ఘంగా ఆలోచించాడు అప్పారావు.

"ఒరేయ్ ఓపని చెయ్యి! నీ ఆఫీసులో అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు నాటకం అడు. బుగ్గ మీద లిప్‌స్టిక్ ముద్ర వేసుకో ! మా ఆవిడ హెండ్ ఖర్చీఫ్ ఇస్తా ! జేబురుమాలుకు సెంటు పూసి మీ ఆవిడకు చూపించు... ఈదెబ్బతో చంద్రిక బింకంపోయి నీ ఒడిలోవాల్తుంది! ఓ ప్రేమలేఖకూడా రాసిస్తా తీసికెళ్ళు".

"నీది గొప్ప బ్రెయిన్ గురూ!"

గురువు గారికి నమస్కారం పెట్టి ఇంటిముఖం పట్టాడు.

☆ ☆ ☆

భోజనం అయ్యేక తీరిగ్గా తమలపాకులకు సున్నం రాస్తూ పట్టెమంచంపైన సుబ్బారావు పక్కన కూర్చుంది చంద్రిక.

మాటిమాటికి బుగ్గలు నిమురుకోసాగేడు సుబ్బారావు. తప బుగ్గల పైని లిప్‌స్టిక్ ముద్రలు ఆమెచూడాలని అతని ఆరాటం.

ఆమె చూసికూడ ఏమీ మాట్లాడకపోవడంతో ఉడికిపోయాడు.

"మా ఆఫీసులో టైపిస్టు సుప్రియ ఉత్త చిలిపి పిల్ల... ఆఫీసులో ఎవ్వరూ లేనప్పుడు

బలవంతంగా వాటేసుకుని ముద్దులు పెడుతుంది. నేనంటే పడిచస్తుంది" అన్నాడు తాపీగా.

"కోతలు కొయ్యకండి! మీ ఆఫీసులో లేడీ టైపిస్టులు లేరుగా!" అందామె.

తత్తర పడ్డాడు సుబ్బారావు.

...తనే ఏదో మాటల్లోపడి ఆఫీసులో లేడీ టైపిస్టు లేరనే సంగతి చెప్పేసి వుంటాడు... తనుత్తఫూల్... అయినా ధైర్యం తెచ్చుకుని చంద్రిక నమ్మేటట్లుగా చెప్పాలి...

"ఈ మధ్య కొత్తగా చేరిందిలే! కావాలంటే ఈ ఉత్తరం చూడు. నా 'ప్రియ' నాకు రాసిన ప్రేమలేఖ..." జేబులో నుంచి ప్రేమలేఖ తీసి చంద్రికకు యిచ్చాడు.

"డియర్ సుబ్బూ - నువ్వు కొత్త సబ్బు బిళ్ళలా సువాసనలు వెదజల్లుతూ నా మనస్సును దోచేసావ్ ! పిండి రుబ్బేటప్పుడు, బట్టలుతికేటప్పుడు నువ్వే గుర్తుకు వొస్తుంటావ్! తలుపేస్తున్నప్పుడు వలపుతలపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది...

రేపు మా యింటికి తప్పకుండా భోజనానికి రావాలి.

జానీవాకర్ (బ్లాక్ లేబుల్) నీకోసం అట్టేపెట్టా!

ఎప్పటికి

నీ ప్రియ

ప్రేమలేఖ చదివేసి సుబ్బారావు జేబులో కుక్కింది చంద్రిక.

"ఎలావుంది. ప్రేమలేఖ?"

"ఏవడో మొగాడు రాసిన ప్రేమలేఖలా వుంది. అయినా మీకిదేంగ్రహచారం! మొగోళ్ళ చేత ప్రేమలేఖలు రాయించుకునే పరిస్థితికిదిగజారారు. కావాలంటే నేనే వోవంద ప్రేమలేఖలు రాసిచ్చేదాన్నిగా!"

"మొగాడు రాశాడని నీకెలా తెలుసు?" - అనేసి నాలిక కొరుక్కున్నాడు.

"సరేలెండి! రేపు భోజనానికి యింటికి రారన్న మాట. మీకు భోజనం ఏర్పాట్లు చెయ్యఖ్ఖర్లేదు" అంటూ దుప్పటి కప్పుకునిపడుకుంది చంద్రిక.

ఆ రాత్రి సుబ్బారావుకి నిద్రపట్టలేదు.

☆ ☆ ☆

"ఫస్ట్ సీన్ అట్టర్ ఫ్లాప్‌రా !' అప్పారావు దగ్గరకొచ్చి వాపోయారు.,

సుబ్బారావుని ఓదార్చాడు.

"మరో ప్రయత్నం చేద్దాం... ఈ రోజు మందుకొట్టేసి, సిగిరెట్టు పీలుస్తూ యింటికెళ్ళు!"

" ఈ సిగిరెట్లూ , మందులూ నాకు అలవాటు లేదు గదరా!'ట

"పిచ్చి సన్నాసీ! నేచెప్పినట్లు చెయ్యి... రేపటినుంచి రాత్రిళ్ళు యింటికి రానని చెప్పెయ్యి! సుప్రియ యింట్లోనే పడుకుంటానని చెప్పు".

" మా అమ్మ, నాన్న చూస్తే కొంపమునుగుతుందిరా!"

"నీ కొంప ఎట్లాగూ మునిగిపోబోతూ వుంది నీ ప్రేమనేకని ఒడ్డుకు తీసుకురావాలనే గదరా నా ప్రయత్నం ! రేపు నేనూ మా ఆవిడవూరికి వెళ్ళున్నాం. మా యింట్లోనే వారం రోజులు మకాం వెయ్యిం. క్యాంప్‌కి వెళ్తున్నానని యింట్లో చెప్పి తగలడు. ఈ దెబ్బతో మీ ఆవిడకు పట్టిన దయ్యం వదలాలి.. నీదారికిరావాలి... ఓకే... బెస్టు ఆఫ్ లక్!"

సుబ్బారావు తలూపేడు.

☆ ☆ ☆

"మీరు సిగిరెట్టు తాగుతుంటే అచ్చు దేవానంద్‌లా వున్నారండీ!"

"నేనుతాగొచ్చాను... వాసనరావడంలా?" విస్కీ చుక్కలు చల్లుకున్న చొక్కా కాలర్‌ని చంద్రిక ముక్కు దగ్గరుంచాడు సుబ్బారావు.

"భలేవుందండీ వాసన! తాగేవాళ్ళంటే నాకు భలేయిష్టం... దేవదాసు పాత్రంటే చస్తాను"

... ఇదెక్కడ దొరికిందిరా బాబూ! అంతా రివర్స్ గేర్‌లో వస్తోంది... ఈ అల్లరిపిల్ల దగ్గర నాటకాలు ఆడటం చాలాకష్టం... తననునిజంగా పిచ్చివాడిని చేస్తున్నది...

"ఈ హాండ్ ఖర్చీఫ్ ఎక్కడిదండీ?" సుబ్బారావు చేతిలోని కర్చీఫ్ లాక్కుంటూ అడిగింది.

" నా ప్రియభామినిది"

ఎర్రరంగు జేబురుమాలు. తెల్ల దారంతో పూలగుత్తుల అల్లిక... వోమూల ఇంగ్లీషులో 'మధు' అని పోడిఅక్షరాలు కుట్టివున్నాయి...

ఇది తను మాధవికి కుట్టించి యిచ్చిన ఖర్చీఫ్... ఈయన దగ్గరకెలా వొచ్చింది?

...దొరికాడు దొంగ...

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ సుబ్బారావుకు దూరంగా జరిగి పడుకుంది చంద్రిక.

☆ ☆ ☆

"సుబ్బారావు మీ ఆయనని నాకు తెలియనే తెలీదు. నీ పెళ్ళప్పుడు మా 'లహరి' కడుపులో వుండటంతో పెళ్ళికి రాలేకపోయాను. సుబ్బారావుగారూ, మా ఆయన క్లోజ్ ఫ్రెండ్స్! వాళ్ళు రోజూ నీగురించే మాట్లాడుకొనేవాళ్ళే ! మీ ఆయన్ని ఎందుకలాఏడ్పిస్తున్నావ్!" అడిగింది మాధవి.

"అందరిలా అలంకరించినగదిలో మొదటి రాత్రి గడిపెయ్యడం నాకిష్టంలేదే! జీవితాంతం మొదటి రాత్రి మా ఆయనకి గుర్తుండేటట్లు చెయ్యాలని నాతపన. ప్రేమపాలకి సరసం చక్కెర జోడిస్తేనే రుచి!" – అంది చంద్రిక నవ్వుతూ.

"ఓ ప్లాన్ వేద్దామే! ఈరోజే మేం వూరికి వెళ్తున్నాం! నీ సుబ్బారావు మా యింట్లో పడుకుని నిన్ను ఏడ్పించమని మా ఆయన సలహా యిచ్చేడు. మా వంటతనికి, పనిమనిషికి చెప్పివెళ్ళతా! సాయంత్రం వొచ్చి యింట్లో వుండు. రాత్రికివొస్తాడు మీ ఆయన. కాసేపు ఉడికించి. ఏడ్పించి ఆతర్వాత సుస్టుగాభోం చేసి మేడపైకివెళ్ళండి... పండువెన్నెట్లో 'జోత్స్నా భిసారికవైపో!"

"పోవే!... నాకూ యిన్నాళ్ళూ సుబ్బారావుకు దూరంగా వుండాలంటే క్షణమొకయుగంలా వుందే! ఒక వొక్కక్షణం కూడ వృధాచెయ్యం... మీయిల్లేమాకు బృందావనం!"

వ్యానిటీ బ్యాగ్‌లో నుంచి హ్యాండ్ ఖర్చీఫ్ తీసి మాధవికి యిచ్చింది.

"చూశావాగమ్మత్తు! నేను స్వయంగా కుట్టి నీకు ప్రజెంట్ చేసిన కర్చీఫ్ మళ్ళీ నా దగ్గరకే వొచ్చింది. ప్రేమసి యిచ్చిందంటూ నా పిచ్చి సుబ్బారావు నాకిచ్చాడు".

"మీ ఆయన్ని నేనెక్కడవల్లో వేసుకున్నానోనని పరిగెత్తుకొచ్చావన్నమాట!" – చంద్రిక బుగ్గగిల్లుతూ అంది మాధవి.

"అదేం కాదులేవే! మీ ఆయన మా సుబ్బారావు మిత్రులని అప్పుడే పసిగట్టాను... నీకు 'ప్రేమ, దోమ' ఈ ఆలోచనలు నీకెక్కడొస్తాయి. నీబుజ్జిపాప లహరే నీకు ప్రపంచం!"

"నీక్కాదవో బుజ్జిపాప పుట్టడానికి ఈరోజే పెద్దలు శుభముహూర్తం నిశ్చయించినారు. గావున నువ్వు యింటికెళ్ళి సాయింత్రం ఇక్కడి కొచ్చేయి"

☆ ☆ ☆

నీరసంగా అప్పారావు యింట్లోకి అడుగుపెట్టాడు.

"భోజనం చేస్తారా బాబూ!" వంటతను ఎదురొచ్చి అడిగాడు.

"ఆకలిగా లేదు... నా పడక ఎక్కడ!"

"మేడపైన బాబూ! మీకు ఆకలైతే కింద కొచ్చి నన్ను లేపండి బాబూ! నేనిక్కడే పడుకుంటాను"

మేడపై గదిలో పూడుకున్నాడు సుబ్బారావు. బయటంతా పిండారబోసినట్లు వెన్నెల. చల్లటి గాలి. సన్నజాజి పరిమళం గదిలోక్కొడ వొచ్చి సుబ్బారావుని మరింత పిచ్చివాడిని చేస్తున్నది.

... నన్నెందుకిలా ఏడిపిస్తున్నావ్ చంద్రీ! కిందటి జన్మలో ప్రేయసీప్రియుల్ని విడదీశానేమో!... ఎక్కడో సన్నగా నవ్వు...

... గాజుల గలగలలు...ఉలిక్కి పడ్డాడు సుబ్బారావు.

... కొంపదీసి ఆడదెయ్యాలు లేవుగదా!

... పాలసముద్రపు కెరటంలా ఎవ్వరో తెల్లచీర కట్టుకుని తనవైపే వొస్తోంది... తన తలను రొమ్ములకేసి అదుముకుంటూ ఫక్కున నవ్వింది...

ఆ నవ్వు బాగా పరిచితమైన నవ్వు!

గభాలున మంచం మీద నుండి లేచి వెళ్ళి లైట్‌స్విచ్ వేశాడు.

అందంగా మలచిన పాలరాతి బొమ్మలా మంచంమీద కూర్చున్న చంద్రిక కన్పించింది.

హిప్... హిప్... హుర్రే...

ఆనందం పట్టలేక పిచ్చిగంతులు వేశాడు...

ఆమెను కౌగిట్లో బిగించి పెదవుల్ని ముద్దుపెట్టుకున్నాడు.

ఆమె అందానికి సెంటర్ ఆఫ్ గ్రావిటీలో వున్న బొడ్డుపై ముద్దుల వర్షం కురిపించాడు. కిలకిలా నవ్వింది.

"ఇక్కడ కెలా వొచ్చావ్?"

"ఈ సమయంలోనా ఆ చచ్చుప్రశ్న?"

ఆమె వక్షోజాల మధ్య తలవుంచి గట్టిగా నిట్టూర్పు విడిచేడు.

"లైన్ క్లియర్" అంది చంద్రిక. సుబ్బారావు మొహాన్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

సుబ్బారావు చేతులు చంద్రిక వొళ్ళంతా తడుముతున్నాయి.

"ఈ గదిలోకంటే బయట వెన్నెట్లో పక్క వేసుకుంటే బాగుంటుంది".

"భోంచేసేక బయట వెన్నెట్లో తీరిగ్గా!" అంది చంద్రిక.

వేడి, వేడి మీద వున్నాడేమో రెండు నిముషాల్లో చల్లారిపోయాడు సుబ్బారావు. *

**(స్వాతి - 20-12-1985)**